# 60 ఏళ్ళ భర్త

ఆమె...

పదహారణాల పడుచు పిల్ల!

వెన్నెల విరిసినట్టుగా... జలపాతం వురికినట్టుగా... ప్రకృతి నవ్వినట్టుగా... కుసుమం విచ్చినట్టుగా వున్న ఆమె తొలి యవ్వన అందాన్ని ఏ చిత్రకారుడి కుంచెనేత్రాలు గాంచినా, అద్భుత కళాఖండాన్ని గీయక మానవు.

హిమత్పర్వత సానువుల్లో మొలచిన చిత్రవర్ణ పువ్వులా ఆమె అందం ఎంత అపురూపమైనదో, ఆమె మనసు కూడా అంత అందమైనది. స్వచ్ఛమైన మల్లెల పరిమళాలతో సహా ఆమె లోకానికి అనువదిస్తే ఆమె 'మనసు!' ఈ మనసు దోచే మగాడెవరో గాని అదృష్టవంతుడు కదూ. ఈ అదృష్టవంతుడెవ్వరో కాదు, స్వయానా ఆమె మేనమామ.



ప్రేమ, ఆనందం, హాయి, ఆటపాటలు తప్ప మరేవీ తెలియకుండా జీవితాన్ని అల్లారు ముద్దుగా అనుభవిస్తున్న ఆ అందాల భరిణె ఏ క్షణాన ప్రేమలో పడిందో, ఇక ఆ క్షణం నుంచే భవిష్యత్ జీవితాన్ని మేనమామ సన్నిధిలో అందంగా ఊహించుకోవడం మొదలెట్టింది. ఆమె అందమైన ఊహలకు అతడు ప్రతిరూపమౌతుంటే కలల కౌగిట్లోనే కాదు, వాస్తవపరిధిలో కూడా ప్రేమామృతాన్ని గ్రోలుతూ మేనమామతో కల్సి పంట పొలాల పచ్చని గట్ల వెంబడి ప్రేమను ఆరబోసుకుంది.

చిన్నప్పుడే ఇద్దరికీ పేరు పెట్టారు కాబట్టి ఇద్దరి మధ్య ఆవిష్కరింపబడుతున్న స్నేహానురాగాలు ఇరువురి కుటుంబ సభ్యులను ముచ్చటగొలిపాయి.

పెద్దల ఆమోదం మధ్య ఎక్కడైతే ప్రేమ పరిమళిస్తుందో అక్కడ సంపూర్ణ సంతసానికి కొదవ వుండదు. అంతా సుమధుర స్వప్నాల సంచారం, అంతటా సుమ సుగంధాల విహారం. అదో నిత్య వసంత సముజ్జ్వల సంబరం.

* * * *

అతడు...

అక్షరాల అరువది వసంతాల కురు'యువకుడు'.

వేదమంత్రాల్ని ఔపాసనపట్టిన స్వచ్ఛమైన బ్రాహ్మణుడు.

అతడి పౌరోహిత్యానికి చుట్టుపక్కల గ్రామాల్లో సైతం ఎనలేని గౌరవమర్యాదలున్నాయి. కొడుకులు, కోడళ్ళు, కూతుళ్ళు, మనవలు, మనవరాళ్ళు అందరి మధ్య అతడి జీవితం పరిపూర్ణతను ఆపాదించుకోగా, ఆనంద స్వరాలు అతడి జీవ లోగిలిలో పదిలంగా వినబడుతుంటాయి.

జాతక దోషాల్ని, అరిష్టాల్ని, గ్రహ ప్రభావాల్ని, శాంతుల్ని తన దైవధ్యానంతో పటాపంచలు చేయగల సమర్థుడు అతడు. అందుకే సకల దోష పీడితులు నిత్యం అతడి ఇంటి ముందు భక్తిప్రపత్తులతో కనిపిస్తుంటారు. అతడి ఇల్లు దేవాలయం లాంటిది. అక్కడికి వచ్చే వాళ్ళు శుచి శుభ్రతల్ని పాటించి తీరాల్సిందే. అతడ్నే దైవసమానంగా ఎంచి ఆరోగ్యం కోసం, సుఖశాంతుల కోసం వేడుకోవాల్సిందే.

అతడి భార్య సద్గుణవతి. భర్త అడుగుజాడల్లో నడుస్తుంది. ఇంటికి వచ్చిపోయే వాళ్ళని చల్లని చిరునవ్వుతో పలకరిస్తుంది. మానవత్వంతో ప్రవర్తిస్తుంది. మంచి మాటలతో అందరినీ అలరిస్తుంది. ఆమె సుగుణమే ఆమెకు దేవుడంతటి మొగుడ్ని ఇచ్చిందని అందరూ అనుకున్నారు. మరి నిజమేనా?

* * * *

మహబూబ్‌నగర్ జిల్లా.
ఆత్మకూర్ తాలూకా.

● ఇది నిజంగా జరిగింది

# 16 పళ్ళ భార్య

ఈ తాలూకాకు దాదాపు ఇరవై కిలోమీటర్ల దూరాన ఒక కుగ్రామం.

ఆమె.... సువర్ణలత.

అతడు... విశ్వనాథ శాస్త్రి.

అందరి ఆడపిల్లల్లా సువర్ణలత పన్నెండేళ్ళ ప్రాయంలోనే పుష్పవతి కాలేదు. ఏదోలే పిల్ల ఆలస్యంగా వుంటే వుంటుంది అని సరిపెట్టుకున్నారు తల్లిదండ్రులు. పదహైదేళ్ళు దాటిపోతున్నాయి. అయినప్పటికీ సువర్ణ రజస్వల కానేలేదు. ఇంటి దేవర వీరనాగమ్మ తమ కూతురిపై కన్నెర్రజేసిందున ఇలా జరుగుతుందని భావిస్తూ పెద్ద ఎత్తున వీరనాగమ్మ పూజల్ని జరిపించారా తల్లిదండ్రులు. కాని ఫలితం శూన్యం. ఇక ఆలస్యం చేయలేదు. వెంటనే విశ్వనాధశాస్త్రి దగ్గరకు సువర్ణలతను తీసుకెళ్ళారు.

సువర్ణలత నిజంగా సువర్ణమే. ఆమెని చూడగానే అతడిలో వక్రాలోచనలు తలెత్తాయి. అందుకు తన మంత్రశాస్త్ర ప్రావీణ్యాన్ని అడ్డుపెట్టుకుని వాటి అండతో సువర్ణలతని తన స్వంతం చేసుకోవాలని నిశ్చయించుకున్నాడు.

విశ్వానాధశాస్త్రి గురించి 'మంచివాడు'గానే అందరికీ తెల్సు. అతడి మీద అతడి మాట మీద అతడి మంత్రం మీద అందరికీ అపారమైన నమ్మకం వుంది. అందుకే అతడ్ని తగాదాల సమయంలో ఒక పెద్ద మనిషిగా తీర్పుకై గ్రామ పెద్దలు ఆహ్వానిస్తుంటారు. ఇలాటి విశ్వనాధశాస్త్రి చెప్పిన మాటని ఎవరైనా త్రోసివుచ్చుతారా? త్రోసివుచ్చే ధైర్యం ఎవరికీ లేదు కాబట్టే 'సువర్ణలత మీద శని, అంగారక గ్రహాల ప్రభావం అత్యధికంగా ప్రబలి వుందని, ఆమెకు శాంతి జరిపించాలని, లేదంటే ఆమె భవిష్యత్ జీవితం అగమ్యగోచరంగా తయారౌతుందని' కట్టుకథలు చెప్పడమే కాకుండా... 'సువర్ణలతని కొన్ని రోజులు తన ఇంట్లోనే వుంచండని, ఇక్కడ వుండటం వల్ల ప్రతినిత్యం తను చేసే పూజలో ఆమె పాల్గొన్నట్టుగా వుంటుందని, అంతేకాకుండా ఆమె కోసం తను ప్రత్యేకమైన పూజల్ని జరిపిస్తానని' అందమైన అబద్ధాల్ని అతి నమ్మకంగా నందించాడు.

విశ్వనాధశాస్త్రి మాటల్ని నమ్మిన తల్లిదండ్రులు ఇంకే మాత్రం ఆలోచించలేదు. ఆలోచించేంత పని కూడా లేదు. ఎందుకంటే అందరి దృష్టిలో విశ్వనాధశాస్త్రి దేవుడు. ఇలాంటి శాస్త్రి చెప్పిన విషయం పట్ల ఆలోచిస్తే అది అవివేకమే అవుతుంది కదా. అందునా ఇంట్లో శాస్త్రిగారి ముగ్గురు కొడుకులు, ముగ్గురు కోడళ్ళు, ఆరుమంది మనవలు, మనవరాళ్ళతోపాటుగా సుగుణవతైన శాస్త్రి భార్య గాయత్రీదేవి వుంటుంది కదా. ఇలాంటపుడు సువర్ణలతని శాస్త్రిగారి ఇంట్లో వుంచాలా? వద్దా? అనే ఆలోచన ఎందుకొస్తుంది? రాదుగనుకనే సువర్ణలతని శాస్త్రిగారి ఇంట్లో వుంచేసి వెళ్ళిపోయారు తల్లిదండ్రులు.

సువర్ణలత అగ్రకులానికి చెందిన అమ్మాయే. కాని బ్రాహ్మణురాలు కాదు. అయితేనేం విశ్వనాధశాస్త్రికి నచ్చింది. కాబట్టి తన ఇంట్లో వుంచుకున్నాడు. ఆమె మీద అదనుచూసి అత్యాచారం చేసే ఉద్దేశ్యం కాదు అతడిది. అతడిది ఆలోచన బలవత్తరమైనది. బహుచురుకైనది. ఆ ఆలోచనని ఆచరణలో పెట్టేందుకే ఆమెను తన సామీప్యంగా వుంచుకున్నాడు.

సువర్ణలతది అదే వూరు. కాబట్టి ఆమె తల్లిదండ్రులు ప్రతిరోజూ ఎక్కువ సమయం కూతురి దగ్గరే గడిపేవాళ్ళు. తండ్రి తన పనులమీద బయట తిరిగినా తల్లి మాత్రం కూతురి దగరే గడిపేది.

విశ్వనాధశాస్త్రి అలుపెరుగక తను కూతురి కోసం పూజల్ని జరిపించడం, తాయెత్తులు కట్టడం, నియమ నిబంధనల్ని పాటించడం చూసి మురిసిపోయారా తల్లిదండ్రులు. మురిసిపోరామరి? తమ కూతురి కోసం మరో వ్యక్తి తన పనుల్ని మాని శ్రమించడమంటే మాటలా?

నెల రోజులు గడిచిపోయాయి. అంతా సవ్యంగా జరిగిపోతుందని చెప్పి సువర్ణలతని ఇంటికి పంపించాడు విశ్వనాధశాస్త్రి. ఇంటికొచ్చి వారం తిరిగిందోలేదో సువర్ణలత పెద్దమనిషయ్యింది. తల్లిదండ్రుల ఆనందానికి అవధులులేవు. సువర్ణలత అమ్మమ్మగారిది కూడా అదే వూరు కాబట్టే సువర్ణలత పెద్దమనిషైందని తెల్సినవెంబడే ఫలహారాలు, పట్టుబట్టలు తీసుకుని వెనువెంటనే వచ్చారు. ఆమె అమ్మమ్మ తాతయ్యలతో పాటుగా పెద్ద మేనమామ, మేనత్తవాళ్ళ పిల్లలు, ప్రియుడైన చిన్న మేనమామ అందరూ కల్సి రావడంతో మూలన కూర్చున్న సువర్ణలత సిగ్గుతో ముడుచుకుపోతుందని భయపడ్డ ఆమె తల్లి సువర్ణలతలో కించిత్ సిగ్గుకూడా కనిపించకపోవడంతో ఆశ్చర్యపోయింది. ఆశ్చర్యపోయిన ఆ తల్లికి ఆ సమయంలో తెలీదు.

'తన కూతురిలో అనూహ్యామైన మార్పులు అప్పడే చోటు చేసుకుంటున్నాయని'. పెద్దమనిషైతేనే యవ్వనం ఉరకలు వేస్తుందని, పురదలు వేసే తొలియవ్వనం ప్రేమకై తహతహలాడుతుందనుకోవడం పొరపాటు. ఎందుకంటే ఆమె పెద్దమనిషి కాకమునుపే పద్నాలుగేళ్ళ ప్రాయంలో మేనమామని ప్రేమించింది. అలాంటి మేనమామ తను పెద్దమనిషైనపుడు తనకి ఎదురుగా వుంటే చచ్చేంత సిగ్గేయదూ? కాని విచిత్రం! మేనమామని చూసి ఆమె స్పందించనేలేదు.





## సంసారం అన్నాక ఎడ్జెస్ట్ అవ్వాల్సిందే

అంటోంది బాలీవుడ్ భామ మాధురీదీక్షిత్. పెళ్ళయ్యాక భర్తతో ఎటువంటి కాపురాన్ని కోరుకుంటున్నారు అని అంటే 'పెళ్ళనేది రెండు హృదయాల బంధం. ప్రతి విషయంలోనూ ఎవరో ఒకరు సర్దుకుపోతే ఏ సమస్యా వుండదు. అలా అని తాగుబోతు భర్తని, బూతులతో హింసించే భర్తతో కాపురం చేస్తానని కాదు. అని అంటూ పరిస్థితులు మరీ ఘోరంగా వుంటే మాత్రం అతనిని విడిచిపెట్టడానికే ఇష్టపడతాను అంది. ఇంతకీ ఇంకా పెళ్ళికాలేదు విడాకుల గురించి మాట్లాడుతున్నది ఏమిటబ్బా?

వాస్తవానికి విశ్వనాథశాస్త్రి మంత్ర ప్రభావంతో పెద్దమనిషయ్యిందో లేకా సహజంగా పెద్దమనిషయ్యిందో తెలీదుకాని ఆమె మనస్తత్వంలో మార్పుమాత్రం కచ్చితంగా విశ్వానాథ శాస్త్రి కారణంగానే ఆరంభమైంది. ఇది పసిగట్టలేదెవ్వరు. కాబట్టి ఆమె మౌనానికి కారణమిదంటూ ఇతమిత్థంగా తెల్పుకోలేక ఏవేవో వూహించుకుని సరిపెట్టుకున్నారు.

నెల తిరిగాక రెండవసారి పెద్దమనిషయ్యింది సువర్ణలత. మొదటిసారి వూరువాడా పిలిచి పెద్ద ఎత్తున పండుగలా జరుపుకోగా, రెండవసారి మాత్రం ఇంట్లోనే చిన్నగా జరుపుకున్నారు.

పెద్ద మనిషైన తన కోడలితో ఏకాంతంగా ఏవేవో మాట్లాడాలని, కమ్మగా డీసులాడాలని వెచ్చగా గుసగుసలాడాలని, పంటపొలాల గాలి ఈలలు మధ్య తమ ప్రేమని మునుపటికంటే ఎక్కువ మురిపాలతో పండించుకోవాలని కలలుగన్న ఆ మేనమామ కలలన్నీ కల్లలైపోయాయి. ఆశలన్నీ అడియాశలైపోయాయి. అతడి రెండవ పదుల వయసు సువర్ణలత కోసం ఆరాటపడుతుంటే, తన ఆరాటాన్ని నిలువునా వధించిన పరిస్థితుల్ని చూసి అతడు విస్తుపోయాడు. పెద్దమనిషైనందుకు మునుపటిలా తనతో తిరిగేందుకు ఇష్టపడట్లేదని అపోహపడిన అతగాడికి ఆమె 'అసలు మనసు' తెలియగానే భరించలేకపోయాడు.

### 3

విశ్వనాథ్‌శాస్త్రిని పెళ్ళి చేసుకుంటానని సువర్ణలత పట్టుబట్టింది. శాస్త్రికి తనను ఇవ్వకుంటే ఆత్మహత్య చేసుకుంటానని భయపెట్టసాగింది. ఆమెలోని ఈ మార్పుకు వూరువూరే ఆశ్చర్యపోయింది. ఇన్నాళ్ళ వరకూ మేనమామను చేసుకుంటానన్న పిల్లలో అంతలోనే ఈ మార్పేంటని పక్కవూర్లు కూడా చిత్రపోయాయి.

సువర్ణలతని అదుపులో వుంచేందుకు ప్రయత్నించారు తల్లిదండ్రులతో పాటుగా బంధువులు కూడా. కాని సువర్ణలత ఎవర్నీ ఖాతరు చేయలేదు. అదను చూసి ఇంట్లోంచి పారిపోయే ప్రయత్నాల్ని మొదలెట్టింది. ఒకటి రెండుసార్లు పారిపోయింది కూడా. అదృష్టంకొద్దీ కాపాడుకున్నారేగాని కాపాడుకున్న ఫలితం శూన్యం. ఒకానొకరోజు అదను చూసి పారిపోయింది సువర్ణలత. పారిపోయివచ్చిన సువర్ణలతని తన ఇంట్లోనే వుంచుకున్నాడు విశ్వనాథశాస్త్రి.

అన్నాళ్ళవరకు మిన్నకున్న సువర్ణలత కుటుంబం విశ్వనాథశాస్త్రిపై తిరగబడింది. మా పిల్లను ఏంచేసావంటూ నిలదీసింది.

'మీ పిల్ల నా దగ్గరకొస్తే నాదేం తప్పు? ఇందుకు నేనేం చేద్దును?' అంటూ ఏమీ ఎరుగని నంగనాచిలా మాట్లాడాడు విశ్వనాథశాస్త్రి.

సువర్ణలత తల్లిదండ్రుల ఆవేదనకు అంతులేకుండా పోయింది. తమ కూతుర్ని ఎలాగైనా కాపాడుకోవాలని సకల ప్రయత్నాలు చేసారు. మేనమామ తన ప్రేమని మరువలేక సువర్ణలతని ప్రాధేయపడ్డాడు. ఎవర్నీ కించిత్ కూడా పట్టించుకోకుండా 'తనకు శాస్త్రియే శరణ్యం' అన్నట్టుగా మాట్లాడింది సువర్ణలత. అయినప్పటికీ బలవంతంగా శాస్త్రి దగ్గర్నుండి సువర్ణలతని అందరూ కల్సి లాక్కొచ్చారు. అయినా ఫలితంలేదు. మరోరోజు అనుకూల సమయం చూసి పారిపోయింది.

దీంతో వూరువూరే విశ్వనాథశాస్త్రిని నిలదీసింది. అతడి కుటుంబాన్ని గట్టిమాటలతో ఎదురించి 'ఇదేంటంటూ' అడిగింది. శాస్త్రి నిర్వాకానికి కుటుంబ సభ్యులు లోలోపల వివరీతంగా బాధపడ్డారుగాని కుటుంబ పరువు కోసం బయటకి ఏమనలేకపోయాడు. ఏవేవో సమాధానాలు చెప్పి తప్పించుకోజూసారు. ఏదైనప్పటికీ సువర్ణలత మాత్రం విశ్వనాథశాస్త్రిని వదలలేకపోయింది. అతడు లేకుండా తను లేనట్టుగా వివరీత ప్రవర్తనకు చేరువయ్యింది.

ఎంతచెప్పినా విన్పించుకోకుండా వెళ్ళిపోయిన కూతురు ఇప్పుడా తల్లిదండ్రుల దృష్టిలో చనిపోయింది.

'వశీకరణమంత్రం'తో సువర్ణలతని ఆకర్షించిన విశ్వనాథ శాస్త్రికి ఇప్పుడు మునుపటి గౌరవవైభవం తుడిచిపెట్టుకుపోయింది. సొంత పిల్లల దృష్టిలో అతడు నీచుడు. వూరువాడా దృష్టిలో 'కాముకుడు'. మునుపటిలా అతడి ఇంటికి ఇప్పుడు ఎవ్వరూ రావట్లేదు. పూజలకి, వ్రతాలకి, పలు శుభకార్యాలకి అతడ్ని ఇప్పుడు ఎవ్వరూ పిలవట్లేదు. ఏది ఏమైతేనేం? తనకు మాత్రం పడుచు పెళ్ళాం దొరికిందనే ఆనందం అతడ్ని నవయువకుడిని చేసింది. ఫలితంగా ఇప్పుడు సువర్ణలతకు ఇద్దరు మగపిల్లలు.

గాయత్రీదేవి ముసలమ్మ కాబట్టి శాస్త్రిగారు పలకరించరు. పడుచు పెళ్ళానికి మంచి ఇల్లు కట్టించి ఆదే ఇంట్లో తనూ వుంటున్నాడు.

ఈ కథ నిజంగా జరిగింది.

దెయ్యాలు భూతాలు ఒట్టి భ్రమ. మంత్రాలు ఒట్టి మస్కా. అంత కంప్యూటర్ మయం అంటున్న ఈ నవ నాగరిక సమాజంలో ఈ కథ పలువురికీ చిత్రవిచిత్రంగా అపనమ్మకంగా తోస్తుంది. కాని ఇది కఠోర వాస్తవం. జీర్ణించుకోవడం మీ వల్ల కాకపోతే అది మీ నమ్మకం. పోతే ముద్దుగుమ్మ సువర్ణలత, ముత్తాత వయసున్న ముసలిమొగుడి నీడలో తన జీవితం 'బంగారుమయం' అని అమాయకంగా భ్రమపడుతోంది.

– తంగెళ్ళ శ్రీదేవిరెడ్డి

